సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ׀ 23 ׀ మే ׀ 2023



సాధువులా వచ్చి..
సాధువు వేషంలో వచ్చిన వ్యక్తి ఓ మహిళకు మాయమాటలు చెప్పి నమ్మించాడు. రూ.2.50 లక్షలతో ఉడాయించాడు. 8లో▸



'లక్ష్మీదేవిపల్లి' కోసం పోరాటం
లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కోసం అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేయాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. 8లో▸

26 నుంచి బ్రహ్మోత్సవాలు
బంజారాహిల్స్: హిమాయత్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 26 నుంచి 31 వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 26 రాత్రి 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 31న ఉదయం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం పుష్పయాగం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రజావాణికి 65 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారు తమ కష్టాలను అధికారుల దృష్టికి తెచ్చారు. అర్జీలు స్వీకరించిన తిరుపతిరావు మాట్లాడుతూ.. మొత్తం 65 ఫిర్యాదులు వచ్చాయని ఆయా శాఖల అధికారులకు పంపించి అన్నింటికీ పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశం

ఇబ్రహీంపట్నం రూరల్: కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్‌లో ఉచిత ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, ప్రభుత్వ, పురపాలక, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలు, సంక్షేమ గురుకుల పాఠశాలలు, జవహర్ నవోదయ విద్యాలయాలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో 10వ తరగతి చదివి 7 జీపీఏ కంటే ఎక్కువ మార్కులు సాధించిన ఎస్సీలు, ఎస్టీ, బీసీ విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి, జగ్జీవన్‌రావు భవనం, కొత్తపేటలో సంప్రదించాలని కోరారు. వచ్చే నెల 9న అలాట్‌మెంట్ ఆర్డర్లు పొందొచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివి

షాద్‌నగర్‌రూరల్: సమాజాభివృద్ధికి తెలంగాణ వైతాళికులు భాగ్యరెడ్డివర్మ చేసిన సేవలు మరువలేనివని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ అన్నారు. భాగ్యరెడ్డివర్మ 135వ జయంతిని పురస్కరించుకొని సోమవారం జనవిజ్ఞాన వేదిక డివిజన్ ప్రధాన కార్యదర్శి రజాక్ ఆధ్వర్యంలో లింగారెడ్డిగూడ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ..బాలికల విద్యకోసం భాగ్యరెడ్డివర్మ హైదరాబాద్‌లో 26 పాఠశాలలను స్థాపించారని, జోగిని, దేవదాసి వ్యవస్థల నిర్మూలనకోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. హేతువాద, శాస్త్రీయ భావజాల వ్యాప్తికి అహర్నిశలు శ్రమించారని, బాల్య వివాహాల నిర్మూలన, జంతుబలి నిషేధం, మద్యపాన నిషేధం కోసం ఉద్యమాలు చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం ఏఓ తెన్నోజీ, జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

భయపెట్టిన వాన

సాక్షి,సిటీబ్యూరో: ద్రోణి ప్రభావంతో సోమవారం తెల్లవారుజామున నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రజలను భయాందోళనకు గురిచేసింది. రాజేంద్రనగర్‌లో అత్యధికంగా 5.2 సెం.మీ వర్షపాతం నమోదైంది.

మృత్యుపాశాలు



విద్యుత్ తీగలు యమపాశాలుగా మారుతున్నాయి.. చేతికందే ఎత్తులో ఉన్న వైర్లు.. నిర్వహణలోపంతో తరచూ తెగిపడుతున్న లైన్లు షాకిస్తున్నాయి.. జనంతోపాటు మూగజీవాల ప్రాణాలు హరిస్తున్నాయి.. ఇటు కుటుంబాలకు తీరని వేదన మిగులుస్తుండగా.. అటు ఆర్థిక నష్టాన్ని కలుగుజేస్తున్నాయి.. చర్యలు తీసుకోవాల్సిన అధికారగణం చేష్టలుడిగి చూస్తోంది.

వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- చిన్నపాటి ఈదురుగాలికే తెగిపడుతున్న తీగలు
- ట్రిప్పవని ఫీడర్లు..యథావిధిగా సరఫరా
- మృత్యువాతపడుతున్న జనం, మూగజీవాలు
- డిస్కం ఇంజనీర్లపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాధారణంగా ఏదైనా 11 కేవీ, హెచ్‌టీ విద్యుత్ తీగ తెగిపడితే వెంటనే సంబంధిత సబ్‌స్టేషన్‌లోని ఫీడర్ ట్రిప్ అై ఆ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కానీ నిర్వహణ లోపంతో జిల్లాలోని మెజార్టీ ఫీడర్లు ట్రిప్పవకపోగా యథావిధిగా విద్యుత్ సరఫరా అవుతోంది. అమాయక రైతులతో పాటు మూగ జీవాలు విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడుతు న్నాయి. పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల సాక్షిగా స్థానిక ప్రజాప్రతినిధులు, బాధితులు కరెంట్ సమస్యలపై ఏకరువు పెట్టినా ఫలితం లేకుండా పోతోంది. జిల్లాలో ఏ గ్రామంలోకి తొంగి చూసినా చెట్ల కొమ్మల మధ్యన చేతికందే ఎత్తులో వేలాడుతున్న వైర్లు దర్శనమిస్తున్నాయి. లైన్ల పునరుద్ధరణ కోసం ఏటా రూ.యాభై కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నా సరఫరా వ్యవస్థ మెరుగుపడకపోగా మరింత ప్రమాదకరంగా తయారైంది. సైబర్‌సిటీ, ఇబ్రహీంబాగ్, కొండాపూర్, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, కందుకూరు, షాద్‌నగర్, చంపాపేట్, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం డివిజన్ల పరిధిలో ఈ సమస్య ఎక్కువగా ఉంది.

ప్రకృతిపై నెపం నెట్టి..

నిజానికి లైన్లు, రిలేలు, జంపర్లు, బ్రేకర్లకు డిస్కం ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. వీటిని బిగించిన తర్వాత నిర్వహణ, పని తీరుపై సమీక్ష లేక క్షేత్రస్థాయిలో వీటిని బైపాస్ చేస్తుండటంతో 11 కేవీ, కవర్ కండక్టర్లు తెగిపడినా.. సరఫరా ఆగక అమాయక ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని 11 కేవీ లైన్ల రిలేలపై సరైన పర్యవేక్షణ కరువైంది. సిబ్బంది కూడా రిలే స్విచ్ పని చేయకుండా మ్యానువల్‌గా పెడుతున్నారు. ఏదైనా సమస్య వస్తే జంపర్ పోతుందిలే అనే ధోరణితో ఉంటున్నారు. ఇంజనీర్లకు విషయం తెలిసినా తేలిగ్గా తీసుకుంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రకృతి మీద నెపం నెట్టి పరిహారం చెల్లించి సమస్య సమసిపోయేలా సెటిల్ చేస్తున్నారు. బాధ్యులపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. అంతేకాదు ప్రమాదాలు జరగకుండా తొడుగు ఉన్న విద్యుత్ తీగ (కవర్ కండక్టర్)లను డిస్కం ఏర్పాటు చేస్తుంటే.. సరైన నిర్వహణ లేక అదే తీగ జనం ప్రాణాలను హరిస్తోంది.

ఏకరువు పెట్టినా స్పందన కరువు

- మొయినాబాద్ మండల పరిధిలో మార్చి మూడో వారంలో కురిసిన వర్షానికి చిలుకూరు ఫీడర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఆ ఫీడర్ పరిధిలోని అప్పోజిగూడ, చిలుకూరు, బాలాజీ ఆలయం పరిసరాల్లో వారం రోజులకు పైగా సరఫరా నిలిచిపోయింది. చిలుకూరు బాలాజీ ఆలయం అర్చకులు స్థానిక ఏఈకి ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో వారు ఏకంగా విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.
- ఏప్రిల్ 26న భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి శంకర్‌పల్లి మండలం కొండకల్, శేరిగూడ, కొండకల్ తండాల్లో 12 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వైర్లు తెగిపడ్డాయి. 24 గంటల పాటు సరఫరా నిలిచిపోయింది.
- ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరంలో విద్యుత్ స్తంభాలు వేసేందుకు రూ.10 వేలు అడుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వెలిజర్లలో స్తంభాల పరిస్థితి దయనీయంగా ఉందని ఏకంగా మండల సర్వసభ్య సమావేశం వేదికగా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొన్ని ఘటనలు..

- మార్చి 20న కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి షాబాద్ మండలం గోడిగడ్డలో ఎల్‌టీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఉదయాన్నే పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన జొన్నాడ ఆంజనేయులు గౌడ్ (48) ప్రమాదవశాత్తు తెగిపడిన ఆ వైర్లపై కాలు మోపడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.
- కొత్తూరు మండలం పెంజర్లకు చెందిన దివ్యాంగ రైతు పల్లుగట్ట బాలరాజు(45) ఇటీవల తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి గట్టుపై పడి ఉన్న విద్యుత్ వైరు తగిలి షాక్‌తో మృతి చెందాడు.
- జిల్లేడుచౌదరిగూడ మండలం లచ్చంపేట శివారులో వారం రోజుల క్రితం విద్యుత్ వైర్లు తెగిపడి మేతకు వెళ్లిన రెండు మేకలు విద్యుత్‌షాక్‌తో చనిపోయాయి. ఆగ్రహించిన బాధితులు మేకల కళేబరాలతో తుమ్మలపల్లి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు.
- తలకొండపల్లి మండలం మెదక్‌పల్లిలో వారం రోజుల క్రితం ఓ విద్యుత్ స్తంభం వద్ద వైరు తెగిపడింది. మేతకు వెళ్లిన ఓ ఆవు విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. రైతుకు రూ.లక్ష నష్టం వాటిల్లింది.



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

జిల్లాస్థాయి సీఎం కప్ షురూ

హుడాకాంప్లెక్స్: హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించే జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను సోమవారం కలెక్టర్ ఎస్.హరీశ్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలపై యువతలో ఆసక్తిని పెంచేందుకు ప్రభుత్వం యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో సీఎం కప్‌ను నిర్వహిస్తోందని అన్నారు. ఆరోగ్య పరిరక్షణ, మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడే క్రీడలను ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో చీఫ్ మినిస్టర్ కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ దృష్టి ఎప్పటికీ గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతిపైనే ఉంటుందన్నారు. ఈ దిశగానే గ్రామీణ ప్రాంత క్రీడాకారుల కోసం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఈ.వెంకటేశ్వర్‌రావు, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ హరీశ్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

థాంక్యూ సర్



జీఓ నంబర్ 111ను రద్దు చేస్తూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై జిల్లా నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సచివాలయంలో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 84 గ్రామాల పరిధిలోని రైతులకు ఎంతో మేలు చేకూరనుందని పేర్కొన్నారు. – సాక్షి, రంగారెడ్డిజిల్లా

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు సూచన



చేవెళ్లలోని పాలియేటివ్‌కేర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

చేవెళ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలకేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం, పాలియేటివ్ కేర్ సెంటర్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ స్టోరేజ్ కేంద్రం, రామన్నగూడలోని కంటి వెలుగు శిబిరాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో అందుబాటులో ఉన్న పాలియేటివ్ కేర్ సెంటర్ సేవలను ప్రజలు ఉపయోగించుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని, రోగులతోపాటు ఉండే అటెండర్‌కు సైతం భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని ఆరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ఉన్న డయాలసిస్ పేషెంట్లను గుర్తించి చేవెళ్ల ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్యులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించే ఆరోగ్య పథకాలను ప్రజలకు చేరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఓ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మాసబ్ చెరువును కబ్జా కానివ్వం

- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మాసబ్ చెరువు వద్ద ఆందోళన చేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇతర నాయకులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువును కాపాడే ప్రయత్నంలో జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమేనని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. మాసబ్ చెరువు పరిరక్షణ సమితి, అఖిలపక్ష నాయకులతో కలిసి సోమవారం చెరువులో మట్టి డంప్ చేస్తున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. మాసబ్ చెరువు విషయమై ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను ఎవరిని ప్రశ్నించినా ఇందులో ఇన్‌వాల్వ్ కావద్దని కలెక్టర్ హరీశ్ చెప్పినట్లు చెబుతున్నారని.. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులతో జీతాలు తీసుకుంటున్న అధికారులు భూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారంటూ ఆరోపించారు. కళ్లముందే చెరువు కబ్జా అవుతున్నా పట్టించుకోని అధికారులు ఉండి ఏం లాభమని ప్రశ్నించారు. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలని.. అప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడటంతో పాటు మట్టిని డంప్ చేయకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోర్టు ఉత్తర్వులను అడ్డం పెట్టుకుని చేపడుతున్నటువంటి నిర్మాణాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఐలయ్య, సునీల్, రవీందర్‌రెడ్డి, మల్లేష్, శివలింగం గౌడ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేష్, బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షుడు వద్దిగళ్ల బాబు, టీడీపీ అధ్యక్షుడు వీరేశం, బీఆర్‌ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు యాదిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, యాదగిరి, దర్శన్, మహేందర్‌రెడ్డి, గుత్తా మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాస్టర్‌ప్లాన్ ఇప్పట్లో లేనట్టే!

- భూ వినియోగ మార్పిడి ద్వారానే జీఓ 111 పరిధిలో అనుమతులు
- కన్జర్వేషన్ జోన్ నుంచి వివిధ రకాలుగా వినియోగంలోకి..
- ఎన్నికల అనంతరమే బృహత్తర ప్రణాళికపై కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: జీఓ 111 పరిధిలో ఎలాంటి మాస్టర్‌ప్లాన్ లేకుండానే భూ వినియోగ మార్పిడికి ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. హెచ్‌ఎండీఏ నిబంధనలకు అనుగుణంగానే అనుమతులు ఇవ్వనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 111 జీఓ పరిధిలోని 84 గ్రామాలకు ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపొందించే అవకాశం లేదు. ప్రస్తుతం బయో కన్జర్వేషన్ జోన్‌లోని భూములను చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ (సీఎల్‌యూ) కింద వివిధ రకాలుగా వినియోగంలోకి అనుమతులు ఇస్తారు. ప్రభుత్వ అనుమతితో భూ యజమానులు తమ భూమిని పారిశ్రామిక, నివాస, వాణిజ్య, వ్యాపార అవసరాల కోసం మార్చుకోవచ్చు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలోని వ్యవసాయ, నాలా భూములను ప్రత్యేక కమిటీ ద్వారా చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ ద్వారా నివాసయోగ్యమైన స్థలాలుగా మార్పు చేస్తున్నట్లుగానే జీఓ 111 పరిధిలోని బయో కన్జర్వేషన్ భూములను కూడా మార్చుకొనే సదుపాయం ఉంటుందని ఒక అధికారి వివరించారు. ప్రస్తుతం జంట జలాశయాలకు 10 కిలోమీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలను అనుమతించడం లేదు. బఫర్ జోన్ పరిధిని ఎంత వరకు అనుమతించాలనే అంశంపై మాత్రం స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు.

ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ..

- మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు పెద్ద ఎత్తున కసరత్తు చేయాల్సి ఉంటుంది. ఆసక్తిగల సంస్థల నుంచి టెండర్ల ఆహ్వానించడం మొదలుకొని మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేవరకు కనీసం18 నెలల సమయం పడుతుంది. ఈ ప్రక్రియలో ఏ మాత్రం జాప్యం జరిగినా రెండేళ్లు కూడా దాటొచ్చు. మరి కొద్ది నెలల్లో ఎన్నికలు తరుముకొస్తున్న దృష్ట్యా ఎలాంటి మాస్టర్ ప్లాన్ లేకుండానే భూముల బదలాయింపునకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన జీఓ 168 ప్రకారం సీఎల్‌యూ అందజేయనున్నారు. మంత్రి కేటీఆర్ నేతృత్వంలో హెచ్‌ఎండీఏ కమిషనర్ తదితర విభాగాలకు చెందిన ఉన్నతాధికారుల కమిటీ ఆమోదంతో భూమిని మార్పు చేస్తారు.
- మరోవైపు జీఓ 111 పరిధిలోని శంషాబాద్, మొయినాబాద్, గండిపేట, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, కొత్తూరు మండలాల పరిధిలోని 84 గ్రామాల్లో ఉన్న 1.32 లక్షల ఎకరాల భూముల్లో ఇప్పటికే సుమారు 70 శాతం భూములు సినీ, రాజకీయ, రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయి. ప్రస్తుతం ఆయా వర్గాలకు చెందిన యజమానులు తమ అవసరాలకు అనుగుణంగా సీఎల్‌యూ తీసుకొనే అవకాశం ఉంది. భూ వినియోగ మార్పిడికి అనుమతిచ్చే క్రమంలో జలవనరులు, అడవులు, కొండలు, గుట్టలు, నాలాల వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని వెసులుబాటు కల్పించనున్నట్లు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



ఒకే నగరం–ఒకే ప్రణాళిక..

- ప్రస్తుతం హైదరాబాద్ మహానగరం మొత్తం 5 మాస్టర్‌ప్లాన్లతో కూడి ఉంది. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీహెచ్), సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీడీఏ), హైదరాబాద్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఏడీఏ), ఓఆర్‌ఆర్ మాస్టర్‌ప్లాన్లతో పాటు 2013లో హెచ్‌ఎండీఏ రూపొందించిన 2030–31 మాస్టర్ ప్లాన్ కూడా అమల్లో ఉంది. ఈ ఐదు ప్రణాళికల మధ్య సమన్వయం లేకపోవడంతో అనేక రకాలుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.
- అన్నింటినీ కలిపి ఒకే బృహత్తర ప్రణాళికను రూపొందించేందుకు ప్రభుత్వం గతంలోనే కార్యాచరణ చేపట్టింది. ఈ క్రమంలోనే గతేడాది జీఓ 111 తొలగించనున్నట్లు ప్రకటించిన అనంతరం 'ఒకే నగరం–ఒకే ప్రణాళిక' లక్ష్యంతో బృహత్తర ప్రణాళిక కోసం చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో కమిటీని వేశారు. ఈ కమిటీ ఒకసారి సమావేశమైంది. కానీ ముందుకు వెళ్లలేదు. ఎన్నికల తర్వాత ఈ ప్రతిపాదన తిరిగి ముందుకు తెచ్చే అవకాశం ఉంది.

గ్రామాల అభివృద్ధికి సహకారం

చేవెళ్ల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం తోపాటు అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలం తల్లారం, దుద్దాగు గ్రామాల్లో సోమవారం శుభోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బీ నర్సింహులు, నాయకులు ప్రభాకర్, రమణారెడ్డి, గని, వెంకటేశ్, రవి, రాజు, శేఖర్, పాండరీ, మహేశ్ తదితరులు పాల్గొఉన్నారు.

డయాలసిస్ సెంటర్‌తో పేదలకు మేలు


చేవెళ్లలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో సోమవారం డయాలసిస్ సెంటర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ఖర్చుతో కూడుకున్న డయాలసిస్ సేవలు పేదలకు ఉచితంగా అందుబాటులోకి రావటం సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్లలో 5 డయాలసిస్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోజూ 25 మంది రోగులకు వైద్యం అందుతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీపీ ఎం విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం మాలతి, వైస్ ఎంపీపీ కె.శివప్రసాద్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు టీ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ యాదయ్య, నాయకులు రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్, చందు, నాగార్జున్‌రెడ్డి, ప్రభాకర్, నరేందర్, రాంప్రసాద్, దయాకర్, రవి, కుమార్, గని తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

బీఆర్‌ఎస్ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం పలు నూతన కమిటీలను ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎం నరేందర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా రాంప్రసాద్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా రవికాంత్‌రెడ్డి, విద్యార్థి విభాగంలో నియోజకవర్గ అధ్యక్షుడిగారాఘవేందర్‌రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడిగా దయాకర్‌ను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం మాలతి, నాయకులు ప్రభాకర్, రమణారెడ్డి, నాగార్జున్ రెడ్డి, కృష్ణ, మహేశ్, కుమార్, వెంకటేశ్, రవి, గని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట

శంకర్‌పల్లి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేయడం జరుగుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండలంలోని మహాలింగపురంలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ మాణిక్యరెడ్డి, ఎంపీటీసీ యాదగిరి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, వాసుదేవ్ ఖన్నా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు


గాయపడిన వృద్ధుడు నరసింహ

కేశంపేట: సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడిని టాటా ఏస్ వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధునంపల్లికి చెందిన నరసింహ సైకిల్‌పై గ్రామం నుంచి కేశంపేటలోని నూర్ ఫంక్షన్ హాల్‌కు వస్తుండగా టాటా ఏస్ వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహ తలతో గాయం కావడంతో ఉస్మానియాకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నోరు మూసి.. కింద పడేసి..

- మహిళ మెడలోని 3తులాల బంగారు పుస్తెల తాడు అపహరణ
- వ్యవసాయ క్షేత్రం వద్ద ఘటన


బాధితురాలు జంగమ్మ

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తున్న మహిళను గుర్తుతెలియని దుండగులు బెదిరించి ఆమె మెడలోని పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కీజ్‌గూడ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వీ జంగమ్మ గ్రామ శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని దుండగులు వచ్చారు. ఓ వ్యక్తి మహిళను బెదిరించి అరవకుండా మూతి మూసి కింద పడేశారు. మరో వ్యక్తి ఆమె మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయాడు. బాధిత మహిళ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని క్రైం డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ ఉమామహేశ్వరావు, సీఐలు సందర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

యువకుడి అనుమానాస్పద మృతి


కిరణ్ మృతదేహం

మంచాల: విద్యుత్ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం తోపాటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం ఉదయం మండలంలో వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బోడకొండ గ్రామానికి చెందిన రఘు, రాములమ్మ దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. కొడుకు కిరణ్(21) గ్రామంలో విద్యుత్ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం తోపాటు హౌజ్ వైరింగ్ చేస్తుంటాడు. శనివారం లోయపల్లిలో పని ఉందని చెప్పి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం ఆంబోత్ తండాలోని ఓ వ్యవసాయ బావిలో కిరణ్ మృతదేహం లభ్యమైంది. తమ కుమారుడిని కొట్టి చంపి బావిలో పడేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాధువులా వచ్చి.. బురిడీ కొట్టించి..

- మహిళ నుంచి రూ. 2.60లక్షలతో ఉడాయింపు
- ఆలస్యంగా వెలుగులోకి..
- ఈదులపల్లిలో ఘటన, పోలీసులకు ఫిర్యాదు


మహిళను మోసం చేసిన సాధువు

నందిగామ: నీ భర్తకు గండం ఉంది.. ఇంట్లో ఉన్న బంగారాన్ని బయటకు తీస్తా.. కూతుళ్ల బాగుకోసం పూజలు చేస్తా.. అని ఓ సాధువు.. మహిళను నమ్మించాడు.. మాయమాటలు చెప్పి లక్షల రూపాయలతో ఉడాయించాడు.. ఈ సంఘటన నందిగామ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మోసపోయిన సదరు మహిళ నందిగామ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈదులపల్లికి చెందిన వీ సునీత, దశరథ్‌లు దంపతులు. వీరికి ముగ్గురు కూతుళ్లు. రెండు నెలల క్రితం గ్రామానికి ఓ సాధువు వచ్చి సునీతను పరిచయం చేసుకున్నాడు. తన పేరు రాములు అని శ్రీశైలం నుంచి వచ్చానని చెప్పాడు. నీ భర్త దశరథ్‌కు గండం ఉందని, దోష పరిహారం చేయాలని, ఇందుకు రూ. 15వేలు ఖర్చు అవుతుందని చెప్పాడు. నమ్మిన ఆమె అడిగిన డబ్బు ఇచ్చింది. అనంతరం కూతుళ్ల బాగు కోసం పూజలు చేస్తానని, ఇంట్లో ఉన్న బంగారాన్ని బయటికి తీస్తానని, ఇందుకు రూ. 2.50లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. సాధువు మాయమాటలు నమ్మిన సునీత ఆ డబ్బు కూడా ఇచ్చింది. నెలరోజుల తర్వాత వస్తానని, అప్పటి వరకు ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే నీ భర్త ప్రాణాలకు హాని కలుగుతుందని భయపెట్టాడు. దీంతో ఆమె సాధువు కోసం నెల రోజుల పాటు వేచి చూసింది. ఆయన రాకపోవడంతో మోసపోయానని భావించి నందిగామ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'లక్ష్మీదేవిపల్లి' సాధనకు పోరాటం


మహాధర్నాలో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో అలుపెరగని పోరాటం చేయాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ చేపట్టాలంటూ సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట అఖిలపక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఈ రిజర్వాయర్‌పై చిత్తశుద్ధి లేదన్నారు. ఇటీవల సీఎల్పీ నేత భట్టివిక్రమార్క ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వాన్ని నిలదీస్తే.. స్పందించాల్సిన నాయకులు మీకు బస్సులు పెట్టి ప్రాజెక్టు నిర్మాణ పనులను చూపెడతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఎండీ ఇబ్రహీం మాట్లాడారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెంటనే పనులు చేపట్టాలి

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని అఖిల పక్షం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు తహసీల్దారు గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 72 ప్రకారం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రధాన భాగాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు రాఘవాచారి, నేతలు అర్జునప్ప, బాబర్ అలీ ఖాన్, సత్యం, రాజు, తిరుమలయ్య, రాయికల్ కుమ్మరి శ్రీనివాస్, బాదెపల్లి సిద్ధార్థ, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కత్తులతో బెదిరించి..

- వ్యక్తి కిడ్నాప్.. కలకలం
- స్థానికుల అప్రమత్తతతో చిక్కిన దుండగులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

శంకర్‌పల్లి: ప్రజల చొరవతో ఓ వ్యక్తి కిడ్నాప్ నుంచి బయట పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని జనవాడ గ్రామ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, చర్యాల గ్రామానికి చెందిన సాయికుమార్, అతని స్నేహితుడు నాగరాజు ఉదయం శంకర్‌పల్లిలోని డీఎంఆర్ గార్డెన్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. సాయంత్రం వారు బైక్‌పై ఊరికి వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిని అడ్డుకున్నారు. తాము ఫైనాన్స్ వారమని సాయికుమార్‌ను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకొని వెళ్లారు. 15కిలో మీటర్ల దూరంలోని జనవాడ చౌరస్తా వద్దకు రాగానే సాయికుమార్ అక్కడి జనాన్ని చూసి బైక్ నుంచి దూకేందుకు యత్నించాడు. దీంతో నిందితులు బైక్ ఆపి సాయికుమార్‌ను కత్తులతో బెదిరించారు. బలవంతంగా బైక్‌పై ఎక్కించేందుకు ప్రయత్నించారు. గమనించిన చుట్టుపక్కల ప్రజలు, జనవాడ వాసులు కిడ్నాపర్లను అడ్డుకునేందుకు యత్నించారు. జనంపై కూడా కత్తులతో దాడికి తెగబడ్డారు. గమనించిన స్థానికులు నిందితులను పట్టుకుని చితక బాదారు. శంకర్‌పల్లి, నార్సింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బాధితులు సాయికుమార్, నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై పిడుగు


పిడుగుపాటుకు కాలిపోతున్న కొబ్బరి చెట్టు

కేశంపేట: మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ఇళ్ల మధ్య పిడుగు పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన దిద్దెల చెన్నయ్య ఇంటి అవరణలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో మంటలు వ్యాపించి చెట్టు పూర్తిగా కాలిపోయింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సైబర్ నేరాల్లో రిక'వరీ'

- ఇప్పటి వరకు నేరగాళ్లు కొల్లగొట్టింది రూ.30 కోట్లు
- రికవరీ అయిన మొత్తం కేవలం రూ. కోటి
- ఈ కేసుల దర్యాప్తులో పోలీసులకు ఎన్నో సవాళ్లు
- సూత్రధారులు చిక్కకపోవడమూ ప్రధాన సమస్యే



హిమాయత్‌నగర్: ఇన్వెస్టిమెంట్, క్రిప్టో కరెన్సీ, పార్ట్ టైమ్ జాబ్.. ఇలా వివిధ రకాలుగా ఎర వేస్తున్న సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఈ కేసుల్లో నేరగాళ్లు చిక్కడం ఎంత కష్టమో...వారి నుంచి సొమ్ము రికవరీ చేయడం అంతకు మించిన పనిగా మారింది. హైదరాబాద్ సిటీ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో దాదాపు వెయ్యికి పైగా నమోదైన కేసుల్లో బాధితులు రూ.30 కోట్ల వరకు నష్టపోయారు. అయితే పోలీసులు రికవరీ చేయగలిగింది మాత్రం రూ.కోటి వరకే ఉంది. రాజస్థాన్, బీహార్, ఢిల్లీ, యూపీ వంటి ప్రాంతాలకు చెందిన కొందరు నేరగాళ్లు నగరవాసులకు గాలం వేస్తున్నారు. టెలిగ్రామ్, వాట్సప్ ద్వారా పరిచయాలను పెంచుకుంటున్నారు. తొలిరోజుల్లో తక్కువ సొమ్ముకు ఎక్కువ రాబడిని ఇస్తూ నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నారు. ఆ తర్వాత భారీ మొత్తం స్వాహా చేస్తూ అమాయకుల్ని అప్పుల పాలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఈ నెల 20వ తేదీ వరకు హైదరాబాద్ సిటీ సైబర్ క్రైంలో నమోదైన ఎఫ్ఐఆర్‌ల సంఖ్య 1150గా ఉంది.

ఎంత కష్టపడ్డా రికవరీలో సమస్యలు

సైబర్ నేరగాళ్ల బారినపడ్డ నగర వాసులు డబ్బును కోల్పోయి సైబర్ క్రైమ్ పోలీసుల్ని ఆశ్రయిస్తున్నారు. రికవరీ విషయంలో పోలీసులు ఎంత కష్టపడ్డప్పటికీ ఫలితం దక్కట్లేదు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేరస్తులంతా బ్యాంకు ఖాతాలు, ఫోన్ నెంబర్లు నకిలీవి వినియోగిస్తున్నారు. ఇక్కడ ఎఫ్ఐఆర్ నమోదు అయ్యాక సంబంధిత బ్యాంకు కేవైసీ ఆధారంగా ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న పోలీసులకు ఈ కారణంగానే సూత్రధారులు చిక్కట్లేదు. ఒకటిరెండు కేసుల్లో చిక్కినా రికవరీ మాత్రం ఆశించిన స్థాయిలో ఉండట్లేదు. అప్పటికే డబ్బును ఖర్చు చేయడం, ఇతర దేశాలకు పంపడం లాంటి జరగడమే దీనికి కారణం. దీంతో సైబర్‌క్రైంలో నమోదైన కేసుల రికవరీ విషయంలో పోలీసులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

పెళ్లి కుదరడం లేదని..

మనస్తాపంతో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య


వెంకటేశ్ (ఫైల్)

పరిగి: పెళ్లి కుదరడం లేదని మనస్తాపం చెందిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలో రూప్‌కాన్‌పేట్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటేశ్(31) గచ్చిబౌలిలోని ఎంటీ సెక్షన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి ఏడాది కాలంగా కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఎంతకీ కుదరకపోవడంతో మనస్తాపానికి గురైన కానిస్టేబుల్ సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

తాండూరు టౌన్: రైలు ఢీకొనడంతో ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ ఘటన తాండూరు రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. తాండూరు రైల్వే స్టేషన్ యార్డు సమీపంలో రైలు ఢీకొనగా సుమారు 50 ఏళ్ల మహిళ మృతి చెందిందన్నారు. మహిళ ఒంటిపై నీలం, ఆకుపచ్చ రంగు పూల చీర, ఎరుపు రంగు జాకెట్ ధరించి ఉందన్నారు.

టీఎస్‌ఎఫ్‌సీకి 18 ఎకరాలు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నంబర్ 307లోని 18 ఎకరాల భూమి హక్కుల విషయంలో రాష్ట్ర ఫైనాన్షియల్ కార్పొరేషన్ (టీఎస్‌ఎఫ్‌సీ.. గతంలో ఏపీఎఫ్‌సీగా ఉండేది)కు అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం సాక్ష్యాల సేకరణలో రిట్ కోర్టుపై నిషేధం లేనప్పటికీ.. భూ టైటిల్, స్వాధీన ప్రక్రియను నిర్ణయించే పరిధి ఆ కోర్టుకు లేదని పేర్కొంది. సివిల్ కోర్టు అధికార పరిధిలో సింగిల్ జడ్జి జోక్యం చేసుకున్నారని అభిప్రాయపడింది. 1955 రెవెన్యూ చట్టం ప్రకారం ఆ భూమి ప్రభుత్వానికి చెందిందా? లేదా? అన్నది తప్పనిసరిగా నిర్ణయించాల్సి ఉందని డివిజన్ బెంచ్ తెలిపింది. రిట్ పరిధిలేని అంశంలో సింగిల్ జోక్యం చేసుకోవడాన్ని తప్పుబట్టింది. ఈ భూమిపై గతంలో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. టీఎస్‌ఎఫ్‌సీకి రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించడంపై అభ్యంతరం తెలిపే హక్కు ఈ కేసులోని ప్రతివాదులకు లేదంది. గాజులరామారం సర్వే నంబర్ 307లోని 18 ఎకరాల భూ వివాదంలో భాగంగా 2011లో భాస్కరరాజుతో పాటు మరొకరు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పిటిషన్లను అనుమతించారు. భాస్కరరాజుకు అనుకూలంగా తీర్పు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం రిట్ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున పర్సా అనంత నాగేశ్వర్‌రావు, ప్రతివాదుల తరఫున హరిశ్రీధర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టివేసింది. ప్రతివాదులు తమ భూ హక్కుల కోసం సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది.